క్లుప్తంగా

కొండెవరంలో కాటన్ జయంతి



కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న స్థానికులు

కొత్తపల్లి: సర్ ఆర్థర్ కాటన్ జయంతిని కండెవరంలో బుధవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి స్థానికులు గాది వెంకటరావు, గాది శ్రీను పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ధవళేశ్వరం ఆనకట్ట నిర్మించి ఉభయ గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన అపర భగీరథుడు కాటన్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు గాది భాస్కరరావు, బర్రె వీరభద్రరావు, గాది చక్రబాబు, గింజల బాబ్జీ, బర్రె సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: సర్ ఆర్థర్ కాటన్ జయంతిని బుధవారం వేట్లపాలెంలో ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా వేట్లపాలెం గోదావరి కాలువ గట్టుపై ఉన్న కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాటన్ సేవలను రైతులు గుర్తు చేసుకున్నారు.

తీరంలో తాబేళ్ల మృత్యువాత



పెరుమాళ్లపురం సముద్ర తీరంలో తాబేలు కళేబరం

తొండంగి: సముద్రంలో అత్యంత ప్రాముఖ్యమైన కూర్మాలు(ఆలీవ్ రిడ్లు) పర్యావరణ కాలుష్యం, ఎండ తీవ్రతకు మృత్యువాత పడుతున్నాయి. బంగాళాఖాతం సముద్ర తీరంలో మండలంలోని అద్దరిపేట, పంపాదిపేట, వేమవరం, యల్లయ్యపేట, కొత్తపేట, అన్నయ్యపేట, జి.ముసలయ్యపేట, దానవాయిపేట, తాటియాకులపాలెం, వాకదారిపేట, పెరుమాళ్లపురం, కొత్తచోడిపల్లిపేట తదితర గ్రామాలతో 17 కి.మీ. ప్రాంతం ఉంది. ఈ తీరమంతా ఇసుక ప్రాంతం కావడంతో సముద్రం నుంచి తీరానికి తాబేళ్లు సంతానోత్పత్తికి గుడ్లు పెట్టేందుకు వచ్చి, మరలా సముద్రంలోకి వెళ్తుంటాయి. ఇటీవల కాలంలో సముద్రంలోకి విడుదలయ్యే హేచరీల వ్యర్థ జలాలు, ఎండ తీవ్రత వంటి కారణాలతో తీరానికి వచ్చిన తాబేళ్లు వందల సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాబేళ్ల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం

ఏలేశ్వరం: గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో వేసవి శిబిరాలను ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. వేసవికాలం పురస్కరించుకుని విద్యార్థులకు వివిధ అంశాలపై వచ్చే నెల ఏడు వరకు విజ్ఞాన శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరాల్లో వివిధ కళలు, చిత్రలేఖనం, కథలు రాయడం, చదవడం, స్పోకెన్ ఇంగ్లిష్, మ్యాథ్స్, యోగా తదితర అంశాలపై శిక్షణ ఇస్తారని వివరించారు. విద్యార్థులు విధిగా విజ్ఞాన శిబిరాలకు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ అధ్యాపకుడు చెన్నాప్రగడ సత్యగాంధీ, ఏబీవీ ప్రసాద్, పుల్లయ్య పాల్గొన్నారు.

కిర్లంపూడి: గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని కిర్లంపూడి, గెద్దానాపల్లి, వీరవరం గ్రంథాలయాల్లో బుధవారం వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభించారు. కిర్లంపూడి గ్రంథాలయంలో పిల్లలకు చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కిర్లంపూడి గ్రంథాలయ అధికారి డి.మరిడిబాబు మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా బుధవారం నుంచి జూన్ ఏడు వరకు విద్యార్థులకు డ్రాయింగ్, కథలు, కథనాలు, సృజనాత్మకత కృత్యాలపై శిక్షణ ఇస్తారని చెప్పారు.

రంగు ఉంటే.. రోగం పండినట్టే!



మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన మామిడి పండ్లు

- మామిడికాయల పక్వానికి రసాయనాల వినియోగం
- కార్బైడ్ వాడకాన్ని నిషేధించిన ప్రభుత్వం
- నిగనిగలాడే రంగు చూసి మోసపోవద్దంటున్న ఆరోగ్య నిపుణులు
- పర్యవేక్షించని అధికారుల తీరుపై విమర్శలు

కొత్తపల్లి: నిగనిగలాడుతూ ఆకర్షణీయంగా మంచి రంగు తేలి, తియ్యటి రస మాధుర్యాన్ని అందించే మామిడి పండంటే ఇష్టం ఉండని వారుండరు. వేసవిలో లభించే ఈ మధుర ఫల ప్రియుల బలహీనతను ఆసరాగా చేసుకుని, కొందరు స్వార్థ వ్యాపారులు హానికర రసాయనాలు వాడుతూ, మామిడి పండ్లను అసాధారణ రీతిలో మాగబెడుతున్నారు. పండ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు, ఆకర్షణీయమైన రంగు వచ్చేందుకు అపాయకరమైన కాల్షియం కార్బైడ్ రసాయనాన్ని పిచికారీ చేస్తున్నారు. ఇటువంటి మామిడి పండ్లను తినడం వల్ల కేన్సర్ సోకే ప్రమాదం ఉందని, ఇది నాడీ వ్యవస్థపై తీవ్ర దుష్ప్రభావం చూపుతోందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. తలనొప్పి, దీర్ఘకాలిక మత్తు వంటి సమస్యలతో పాటు, జ్ఞాపక శక్తి నశిస్తుందని చెబుతున్నారు.

సంప్రదాయ పద్ధతులే సురక్షితం

మామిడి పండ్లను మాగబెట్టడంలో సంప్రదాయ, సాంకేతిక పద్ధతులు పాటించడంలో ఎంతో మేలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. రైతులు క్షేత్ర స్థాయిలో ఉద్యాన అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ, ఎగుమతులకు అనువుగా మాగబెడితే మంచి లాభాలు ఆర్జించడమే కాకుండా, ప్రజలకు సురక్షితమైన పండ్లను అందించవచ్చని చెబుతున్నారు. పిఠాపురం నియోజకవర్గ వ్యాప్తంగా 1,908 ఎకరాల్లో మామిడిని రైతులు సాగు చేస్తున్నారు. గొల్లప్రోలులో 1,744, పిఠాపురంలో 75, కొత్తపల్లిలో 89 ఎకరాల్లో మామిడి సాగవుతోంది. ఈ ఏడాది ఎకరాకు 2 నుంచి 3 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

కొరవడిన పర్యవేక్షణ

మామిడి తోటల నుంచి వ్యాపారులు గుత్తగా మామిడికాయలను కొంటుంటారు. అలా కొనుగోలు చేసిన మామిడి పండ్ల నిల్వలకు నిషేధిత రసాయలను వాడుతూ మగ్గపెడుతున్నారు. మార్కెట్లోకి రసాయనాలతో మగ్గబెట్టిన పండ్లు విచ్చలవిడిగా విక్రయిస్తున్నా ఆహార భద్రతాధికారుల పర్యవేక్షణ కొరవడిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

దీర్ఘకాలిక వ్యాధులు వస్తాయి

> రసాయనాలతో మగ్గబెట్టిన మామిడి పండ్లను తినడం వల్ల దీర్ఘకాలిక రోగాలు సంక్రమిస్తాయి. రసాయనాల ద్వారా పండించిన మామిడి పండ్లను తీసుకున్న వారికి గ్యాస్ట్రిక్ సమస్యలు, విరేచనాలు, వాంతులే కాకుండా, మనిషి పూర్తిగా నీరసించిపోయే ప్రమాదం ఉంది. రంగులు చూసి ప్రజలు మోసపోకుండా, ఎవరి ఆరోగ్యాన్ని వారే కాపాడుకోవాలి.
>
> – సుష్మ, వైద్యాధికారి, కొత్తపల్లి ఆరోగ్య కేంద్రం

కాల్షియం కార్బైడ్ ప్రమాదకరం



> మామిడి కాయలపై కాల్షియం కార్బైడ్ పూయడాన్ని ప్రభుత్వం నిషేధించింది. ఇలా వాడిన వారిపై ఆహార భద్రత అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారు. ఇటువంటి మామిడి పండ్లు తినడం వల్ల దీర్ఘకాలిక వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. రసాయనాలు పూసిన మామిడి పండ్లు తింటే నాలుక, పెదవులు మొద్దు బారినట్టు అనిపిస్తుంది. ఇలా అనిపిస్తే అటువంటి పండ్లను తినవద్దు. ఆరోగ్యకరమైన మామిడిపండ్ల ఉత్పత్తికి రైతులు, వ్యాపారులు సురక్షిత పద్ధతులు పాటించాలి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రైతులు సంప్రదాయబద్ధంగా మగ్గబెట్టిన మామిడి పండ్లనే విక్రయించాలి.
>
> – శైలజ, ఉద్యాన శాఖాధికారి, పిఠాపురం

మార్కెట్‌కు విరివిగా పుచ్చకాయలు



తుని రైతు బజారులో అమ్మకానికి ఉంచిన పుచ్చకాయలు

తుని: వేసవిలో చల్లదనం ఇచ్చే తీగజాతి రకం పుచ్చకాయకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. మెట్ట ప్రాంతం ఇసుక నేలల్లో వీటిని సాగు చేస్తారు. ఈ నెలలో విరివిగా పుచ్చకాయల దిగుబడులు వచ్చాయి. వేసవిలో పుచ్చకాయ తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. పిల్లలు నుంచి పెద్దల వరకు వీటిని జ్యూస్‌గా వినియోగిస్తున్నారు. విటమిన్లు పుష్కలంగా ఉండడంతో జనం ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. స్థానిక మార్కెట్ యార్డులోని రైతు బజారుకు పెద్ద సంఖ్యలో పుచ్చకాయలు వచ్చాయి. సైజును బట్టి ధర చెబుతున్నారు. రూ.40 నుంచి రూ.100 వరకు పలుకుతున్నాయి. వేరే ప్రాంతం నుంచి దిగుమతి చేసుకున్నామని వ్యాపారులు చెబుతున్నారు.

ఆకుపచ్చ రంగులో తాగునీరు



ఫిల్టర్ బెడ్‌లో ఆకుపచ్చ రంగులో ఉన్న నీరు



కుళాయిల ద్వారా నాచు రంగులో వచ్చిన తాగునీరు



నాగార్జున ఫిల్టర్ చెరువులో నాచు పట్టిన నీరు

సామర్లకోట: మున్సిపల్ కుళాయిల నుంచి వస్తున్న తాగునీరు బుధవారం ఆకుపచ్చ రంగులో రావడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఉండూరు రోడ్డులో ఉన్న నాగార్జున ఫిల్టర్ చెరువులోని నీటిని సమీపంలో ఉన్న ఫిల్టర్ ప్లాంటు ద్వారా శుద్ధి చేసి గణపతినగరం, కోట్లమ్మ చెరువు వద్ద ఉన్న ట్యాంకులను నింపుతారు. అక్కడి నుంచి ప్రజలకు పైప్ లైన్ల ద్వారా ఇంటి కుళాయిలకు తాగు నీరు సరఫరా అవుతుంది. అయితే ఫిల్టరు చెరువులో నీరు ఆకు పచ్చరంగులో ఉండటంతో ఫిల్టరు కావడం లేదని, చెరువులో నీటి మట్టం తగ్గిపోవడంతో ఈ పరిస్థితి ఎదురవుతోందని ప్రజలు అంటున్నారు. మున్సిపల్ కమిషనర్ జె.రామారావును వివరణ కోరగా తాగునీరు బ్లీచింగ్ వాసన వస్తోందనే ఫిర్యాదుల మేరకు క్లోరిన్, ఆలమ్ శాతం తగ్గించడం వల్ల నీరు కొద్దిగా నాచు రంగులో వచ్చిందన్నారు. గురువారం నుంచి క్లోరిన్ శాతం పెంచి నీరు స్వచ్ఛంగా వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ తాగునీటిని కాచి చల్లార్చి తాగాలని సూచించారు.

సమష్టి సహకారంతో ఎన్నికలు ప్రశాంతం

- స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భారీ భద్రతా ఏర్పాట్లు
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామారావు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఓ సీతారామారావు

పెద్దాపురం: ప్రతి ఒక్క ఓటరు, వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు, అధికారుల సమష్టి సహకారంతో నియోజకవర్గంతో సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించామని ఈఆర్వో, ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఛాంబర్‌లో బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగింపు నేపథ్యంలో కాకినాడ జేఎన్‌టియూ కళాశాలలో ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ వద్ద భారీ బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు పూర్తిచేసినట్టు తెలిపారు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో కూడా ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. నియోజకర్గ పరిధిలో 2,15,095 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉండగా 13వ తేదీన నిర్వహించిన ఎన్నికల్లో 201 పోలింగ్ కేంద్రాల్లో 1,76,993 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో పోలింగ్ శాతం 82.29 శాతానికి చేరిందన్నారు. అత్యధికంగా ఉలిమేశ్వరం గ్రామంలో 95.19 శాతం ఓటు నమోదు కాగా పెద్దాపురం అర్బన్ 81వ బూత్‌లో అత్యల్పంగా 54.38 శాతం పోలింగ్ నమోదైందని రామారావు తెలిపారు. వచ్చే నెల నాలుగో తేదీన కౌంటింగ్ ఉంటుందన్నారు. కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి సిబ్బందికి శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ ప్రక్రియను కూడా ప్రశాంతంగా నిర్వహించేలా అందరూ సహకరించాలని ఆయన కోరారు.

జనసేన సమావేశం

గొల్లప్రోలు: పట్టణంలోని సత్యకృష్ణ ఫంక్షన్ హాల్‌లో కొణిదల నాగబాబు అధ్యక్షతన పిఠాపురం జనసేన కార్యకర్తలు, ఏజెంట్ల సమావేశం బుధవారం మధ్యాహ్నం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల వేళ జనసేన కార్యకర్తల పోరాట పటిమ మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో కూటమికి చెందిన బీజేపీ, టీడీపీ శ్రేణులు లేకపోవడం గమనార్హం.

ప్రపంచ ఆర్థోడాంటిక్ ఆరోగ్య దినోత్సవం

బోట్‌క్లబ్: స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లోని సత్య దంత వైద్యశాలలో బుధవారం ప్రపంచ ఆర్థోడాంటిక్ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ఎత్తు పళ్లు, వంగర పళ్లు ఉన్నవారు ఆర్థో డెంటిస్టని కచ్చితంగా సంప్రదించాలన్నారు. ఎత్తు, వంకర పళ్లు ఉన్న వారికి గతంలో క్లిప్‌లు వేసేవాళ్లమన్నారు. ఈ తరహా వైద్య విధానంతో ఆహారం తీసుకునేటప్పుడు కొంచెం ఇబ్బంది ఉంటుందన్నారు. ఇప్పుడు క్లియర్ ఎలైనర్స్ వైద్య విధానం ద్వారా అత్యంత సుఖమైన, నొప్పిలేని వైద్యాన్ని అందజేస్తున్నారు. ప్రముఖ ఆర్థోడెంటిస్ట్ స్వరూప్ మాట్లాడుతూ మన ముఖంలో ఎత్తు, వంకర పళ్ల వరుసతో సౌందర్యపరమైన సమస్యలతో మన ఆత్మవిశ్వాసాన్ని ప్రభావితం చేస్తాయన్నారు. ఆర్థోడెంటిస్ట్ ద్వారా ఆ సమస్యలను పరిష్కరించుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేంద్ర, సభ్యులు సిరాజ్, భవాని పాల్గొన్నారు.

18 నుంచి వేణుగోపాలుని కల్యాణోత్సవాలు

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలో ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 18 నుంచి 24 వరకు వార్షిక కల్యాణ మహోత్సవం వైభవంగా జరుగుతుందని ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ నెల 18న స్వామి అమ్మవార్లకు పంచామృతాభిషేకం, అలంకారం, అర్చన, ఈ నెల 19న ధ్వజారోహణం, గ్రామోత్సవం, స్వామి కల్యాణోత్సవం, 21న సదస్య మహోత్సవం, 23న పూర్ణాహుతి, చక్రతీర్థ మహోత్సవం, 24న శ్రీ పుష్పయాగ మహోత్సవం వైభవంగా జరుగుతాయన్నారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మూలవిరాట్‌కు పూర్ణాభిషేకం

తాళ్లరేవు: భూసమేత వేంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాల సందర్భంగా బుధవారం స్వామివారి మూల విరాట్‌కు పంచామృతాలు, పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో పూర్ణాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు నేతృత్వంలో స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

ఏఆర్‌టీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఏఆర్‌టీ శిక్షణలో మాట్లాడుతున్న డాక్టర్ రమేష్

అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రమేష్

పెద్దాపురం: హెచ్ఐవి బాధితులకు జిల్లా కేంద్రంలోనే కాకుండా పెద్దాపురం ఏరియా ఆసుపత్రిలోనూ ఏఆర్‌టీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రమేష్ అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో ఐసీటీసీ విభాగంలో లింక్ ఏఆర్టీ సెంటర్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐసీటీసీ కౌన్సిలర్ బి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏడీఎంహెచ్‌ఓ రమేష్ మాట్లాడుతూ ఇప్పటి వరకు హెచ్ఐవి బాధితులకు కాకినాడలో సేవలు అందించేవారమన్నారు. ఇక నుంచి పెద్దాపురం ఏరియా ఆసుపత్రిలో సమీప మండలాల హెచ్ఐవి బాధితులకు ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. లింక్ ఏఆర్టీ సేవలను బాధితులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రమేష్ సూచించారు. అనంతరం సేవలపై లింక్ ఏఆర్టీ సేవలపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ సతీష్‌రెడ్డి, పీఎం ఆదిలింగం, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

కరప: మండలం వేములవాడలో ఎన్నికల రోజున గ్రామ సర్పంచ్ కమిడి మంగాదేవి భర్త శంకర్‌పై జనసేన పార్టీ కార్యకర్తలు దాడిచేసిన ఘటనలో ఐదుగురు నిందితులను బుధవారం అదుపులోకి తీసుకున్నారు. దూషించి, దాడిచేసినా నిందితులపై చర్యలు తీసుకోలేదని మంగళవారం రాత్రి కరప పోలీసుస్టేషన్ ఎదురుగా వేములవాడ గ్రామస్తులు, మహిళలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన విషయం పాఠకులకు విదితమే.... కరపపోలీసులు ఆందోళనకారులకు ఇచ్చిన హామీ మేరకు బాధ్యులైన ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని, స్టేషన్‌కు తీసుకువచ్చి, 41ఎ నోటీసులు జారీ చేశారు. ఇరువర్గాలతో చర్చలు జరిపి, నిందితులపై కేసు నమోదు చేశామని, విచారణ జరుపుతున్నామని చెప్పడంతో వేములవాడ గ్రామస్తులు వెనుతిరిగారు.



ఇ.గోకవరం సమీపంలో సుబ్బారెడ్డి సాగర్ కాలువపై కుంగిన వంతెన

ఇ.గోకవరంలో కుంగిన వంతెన

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఇ.గోకవరంలో సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు కుడి కాలువపై గ్రామ సమీపంలో దాదాపు రెండు దశాబ్దాల క్రితం వంతెన నిర్మించారు. సాంకేతిక, నాణ్యత పరంగా ఈ వంతెనను సక్రమంగా నిర్మించకపోవడంతో, కొన్నేళ్ల క్రితం ఈ వంతెన కోతకు గురై కుంగిపోయింది. గతేడాది ప్రభుత్వం ఈ వంతెనకు మరమ్మతులు చేపట్టి కొంతమేర పటిష్టపరిచింది. భారీ వాహనాల రాకపోకలతో ప్రస్తుతం ఈ వంతెన మరింత కుంగి ప్రమాదకరంగా మారింది. ఇతర వాహనాలు, పాదచారులు బిక్కుబిక్కుమంటూ వంతెనను దాటాల్సిన పరిస్థితి నెలకొంది. ఏమాత్రం ఆదమరచినా వాహనాలు అదుపుతప్పి నేరుగా కాలువలోకి దూసుకెళ్లే పరిస్థితులు లేకపోలేదు. ఈ వంతెన ఎగువ ప్రాంతంలో ఇ.గోకవరం, మెట్టచింత, ఉలిగోగుల తదితర గిరిజన గ్రామాలున్నాయి. ఈ గిరిజన గ్రామాల ప్రజలు మైదాన ప్రాంతానికి రావాలంటే ఈ వంతెనను దాటాల్సి ఉంది. ఈ వంతెన ప్రస్తుతం ప్రమాద స్థాయికి చేరుకుంది. ఏ క్షణంలో ముప్పు వాటిల్లుతుందోనని స్థానిక గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. రాత్రివేళ ఆదమరిస్తే ప్రాణాలకే ముప్పని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సిరులు కురిపించిన దాళ్వా

- మండలంలో వంద శాతం కోతలు పూర్తి
- 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి
- సార్వాకు సిద్ధమవుతున్న రైతులు



సామర్లకోటలో వరి కోతలు పూర్తి కావడంతో ఖాళీగా ఉన్న పంట భూములు

సామర్లకోట: దాళ్వా వరి పంటకు సంబంధించి 100 శాతం కోతలు పూర్తయ్యాయి. ఈ మేరకు సార్వా వరి పంటకు రైతులు సిద్ధమవుతున్నారు. దాళ్వాలో దిగుబడి ఆశించినదాని కంటే ఎక్కువగా ఉంది. మండల పరిధిలో 22,250 ఎకరాలలో వరి సాగు చేశారు. దాళ్వాలో బొండాలు ఎక్కువగా వేయడంతో 45 నుంచి 50 బస్తాల దిగుబడి వచ్చింది. సన్నరకాలు 40 నుంచి 45 బస్తాల దిగుబడి వచ్చింది. వరి కోతలు పూర్తయిన తరువాత రైతులు పంట భూములను సారవంతం చేసుకునే పనిలో పడ్డారు. జూన్ మొదటి వారంలో గోదావరి కాలువకు నీరు విడుదల కావడంతో సార్వాకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు మండల పరిధిలో సార్వాలో కూడా 22,250 ఎకరాల్లో వరి సాగు జరుగుతుందని మండల వ్యవసాయాధికారులు తెలియజేస్తున్నారు. సార్వాలో ఎక్కువగా సన్నరకాలు రైతులు వేస్తారని వ్యవసాయాధికారులు చెప్తున్నారు.

విత్తనాలను సిద్ధం చేస్తున్న అధికారులు

సార్వా వరి పంటకు సంబంధించి రైతు భరోసా కేంద్రాలు, డీలర్లు విత్తనాలు సిద్ధం చేస్తున్నారు. అయితే ఎక్కువగా రైతులు వారు తయారు చేసుకున్న విత్తనాలకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయాధికారులు చెప్తున్నారు. సన్న రకాలను అనేక మంది విత్తనాలకు ఉపయోగపడేలా పండిస్తున్నారని, దాంతో సన్న రకాలు వేసుకునే రైతులు సమీపంలోని రైతుల నుంచి విత్తనాలు తీసుకుంటారని అధికారులు అంటున్నారు. అయితే రైతులకు విత్తనాలు అందజేసేలా రైతు భరోసా కేంద్రాల్లో వారి వారి అవసరాల మేరకు విత్తనాలు నిల్వ చేస్తున్నట్లు అధికారులు వివరిస్తున్నారు.

పంట కాలువలపై శ్రద్ధ

గోదావరి జలాలు రైతుల పంట పొలాలకు అందేలా పంట కాలువను ఏర్పాటు చేశారు. సార్వా పంట పనులు ప్రారంభించడానికి సుమారు 20 రోజుల సమయం ఉండడంతో పంట కాలువను మరమ్మతులు చేయాలని ఇరిగేషన్ ఉన్నతాధికరుల నుంచి మండల స్థాయి అధికారులకు ఆదేశాలు వచ్చాయి. సామర్లకోట మండలం పీబీ దేవం నుంచి మేడపాడు, జి.కొత్తూరు, వేట్లపాలెం, హుస్సేన్‌పురం, సామర్లకోట, ఉండూరు, అచ్చంపేట, వీకే రాయపురం, మాధవపట్నం గ్రామాలకు గోదావరి జలాలు పంట కాలువల ద్వారా అందజేస్తున్నారు. అలాగే చంద్రంపాలెం, నవర, పవర, గొంచాల గ్రామాల రైతులు పీబీసీ, ఏలేరు కాలువపై ఆధారపడి సాగు చేసుకుంటున్నారు. దీనికి తోడు వర్షాలు పడితే దమ్ములు చేసుకొని పంటల సాగుకు సిద్ధమయే అవకాశాలు ఉన్నాయి.

ఆర్బీకేల ద్వారా విత్తనాలు..



> మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు సిద్ధం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. మండల పరిధిలో సార్వాలో 22,250 ఎకరాలల్లో సాగు జరుగుతోంది. సార్వాలో సన్న రకాలు ఎక్కువగా సాగు చేస్తారు. రైతుల నుంచి సీఎంఆర్ ద్వారా దాళ్వా పంటను కొనుగోలు చేస్తున్నారు. మండలంలో 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. పంట కాలువల మరమ్మతులు చేయాలని ఇరిగేషన్ అధికారులకు ఉత్తర్వులు వచ్చాయి.
>
> – ఐ.సత్య, ఎంఏఓ, సామర్లకోట



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన గోపాలపట్నం - తొండంగి ప్రధాన రహదారి

- ఎండ తీవ్రతకు అల్లాడుతున్న జనం
- సముద్ర తీరాల్లో సేదతీరుతున్న వైనం

తొండంగి: వేసవిలో భానుడి ప్రతాపానికి పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. గ్రామీణ ప్రాంతాలు నిప్పుల కొలిమిలా మారడంతో ఎండదెబ్బకు ప్రజలు అల్లాడుతున్నారు. ఉదయం నుంచి వాతావరణం పూర్తిగా ఉక్కపోతగా ఉండటంతో పాటు ఎండ తీవ్రత ఎక్కువైంది. సుమారు 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఉదయం పది గంటలకే రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే గోపాలపట్నం–తొండంగి ప్రధాన రహదారి జన సంచారం లేక బోసిపోయింది. దీనికి తోడు అడపాదడపా విద్యుత్ కోతల తోడవ్వడంతో ప్రజలు ఇళ్లలో తీవ్ర ఇబ్బందులుపడ్డారు. సాయంత్రం ఆరు గంటలైనప్పటికీ ఎండ వేడి తగ్గని పరిస్థితి నెలకొంది. మరి కొద్ది రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించింది. అప్పటివరకూ వడదెబ్బకు గురి కాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు ఎండలో ప్రయాణాలు చేయకుండా మరింత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాగా బాటసారుల కోసం గోపాలపట్నం రైల్వేగేటు, బెండపూడి, ఒంటిమామిడి తదితర ప్రాంతాల్లో దాతలు చలివేంద్రాలు ఏర్పాటు చేశారు.

కిటకిటలాడుతున్న సాగర తీరాలు

వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు మండలంలోని సాగర తీరాలన్నీ పిల్లలు, పెద్దలతో కళకళలాడుతున్నాయి. ప్రస్తుతం పిల్లలకు వేసవి సెలవులు కావడంతో కుటుంబ సమేతంగా ప్రజలు సాగర తీరాల్లో స్నానాలు చేసేందుకు వస్తున్నారు. దీంతో మండలంలోని అద్దరిపేట, పంపాదిపేట, వాకదారిపేట, దానవాయిపేట, పెరుమాళ్లపురం, కొత్తచోడిపల్లిపేట తదితర సముద్ర తీరాల్లో స్నానాలు చేస్తూ ఉల్లాసంగా గడుపుతున్నారు.